# మానవుడు గెలవలేనిది

ఆ గ్రామం మధ్యలో ఒకకాలువ వర్షాకాలంలో తప్ప మిగతాకాలాలలో సన్నగా జాలువారుతూ ప్రవహిస్తూ ఉంటుంది. ఆ గ్రామస్థులు ఎండలురాగానే చలమలుతీసి నీళ్ళు చెంబులతో ముంచుకుని బిందెలు నింపుకుని మంచినీళ్ళుగా వాడుకుంటారు.

అక్కడ అన్నీ పూరిళ్ళుతప్ప పెంకుటిళ్ళు తక్కువ. అక్కడక్కడ చిన్న దుకాణాలున్నాయి. ఒక పాఠశాల ఒక శివాలయం ఉన్నాయి. అంతాకలిపి రెండువందల గడప ఉంటుంది. అన్నికులాలవాళ్ళూ తమ తమ అంతస్తులనూ గౌరవాలనూ కాపాడుకుంటూ వస్తున్నారు. ఈ మధ్యనే కాస్త రాజకీయాలు తెలుసుకుంటున్నారక్కడి ప్రజలు. ప్రభుత్వం ఒక 'టి.వీ.' పెట్టించింది. అక్కడి ప్రజలకు సాయంత్రంకాగానే రచ్చబండదగ్గర టి.వీ. కాలక్షేపం బాగా జరుగుతున్నది.

ప్రకృతి ఎప్పుడు తన విన్యాసాలను ప్రదర్శిస్తుందో అనూహ్యం. భూకంపం ఎప్పుడువస్తుందో- అగ్నిపర్వతాలు ఎప్పుడు బ్రద్దలవుతాయో- వరదలువచ్చి గ్రామాలు ఎప్పుడు తుడిచిపెట్టుకుపోయి ప్రజలకు నిలవనీడలేకుండా చేస్తాయో ఎవరికీ తెలియదు.

శాస్త్రజ్ఞులు రాబోయే విపత్తునుగురించి సూచనలు కనబడగానే ప్రభుత్వానికి తెలియజెయ్యటమూ, ప్రజలను సురక్షితప్రాంతాలకు చేరుకోమని రేడియో టి.వీ.లద్వారా చెప్పటమూ పోలీసులు ప్రజలను దగ్గరుండి ఇళ్ళు ఖాళీచేయించటమూ జరుగుతుంది. పల్లపు ప్రదేశాలలోఉన్న ఇళ్ళకూ గుడిసెలకూ వరదలవల్ల ప్రమాదము బహుధా జరుగుతునే ఉంటుంది. ఆ వరదల విపత్తే ఆ ఊరికి ఇప్పు డొచ్చిన ప్రమాదము. ఏర్లూ వాగులు ఎక్కడో పొంగాయి. అవి పొంగిపొరలి గుట్టలను గట్లనూ దాటుకుంటూ వచ్చి నదిలో కలిశాయి. అధికారుల ఆజ్ఞలు

ఆలస్యంగా బయలుదేరాయి. గ్రామాన్ని తుడిచిపెట్టటానికి నది పొంగిపొరలి వెల్లువై ఊరంతా గగ్గోలు పరుస్తున్న సమయమది.

అర్థరాత్రివేళ మసకవెన్నెల.

గ్రామంలో మట్టిరోడ్లు. రోడ్లకంటె కాలిబాటలె ఎక్కువ. నీటిపొంగును చూసిన ప్రజలు తొక్కిసలాడుతూ సామాన్లు తలకెత్తుకొని పెద్దపిల్లలను నడిపించు కుంటూ కొందరు, ముదుసళ్ళను బుజాన వేసుకుని నులకమంచాలు చేతబట్టుకుని కొందరూ, గుడ్డలు మూటకట్టుకుని అన్నపుకుండలను తాళ్ళతోకట్టి చేతులకు తగిలించుకుని, పిల్లలను బుజాలమీదికెక్కించుకుని కొందరూ ఆ విపత్కరపరిస్థితిలో అలజడిగా కేకలు వేసుకుంటూ గుంపులు గుంపులుగా బయలుదేరారు. ఆ ఊరు దాటితే పక్కగ్రామం కాస్త మెరకగా ఉంటుంది.

ఆ సమయంలో గ్రామంమీద గ్రామం వచ్చిపడితే సురక్షిత ప్రాంతాలు అంత సులభంగా దరిజేరనిస్తాయా? ఆపదలో సాటిమానవులను ఆదుకోవాలని ఎంతమంది ముందుకువస్తారు?

ఆ గ్రామంలో ఎత్తైన ప్రదేశాలలో కాస్త ఉన్నవాళ్ళు ఇళ్ళుకట్టారు. వాటి ముందర ఉన్న ఖాళీజాగాలోనయినా ఆపదలో పిల్లాపాపలతో ముదుసళ్ళతో వచ్చినవారిని ఉండనిస్తారా? కుక్కలకంటె హీనంగా కసిరికొట్టారు.

కాని విపత్కర సమయంలో కోపతాపాలేంచేస్తాయి? వచ్చిన ప్రజలు పసిపిల్లలకు చెట్లకు గుడ్డ ఉయ్యాలలు వేశారు. నులకమంచాలను చెట్లకొమ్మలకు తాళ్ళతోకట్టి ముదుసళ్ళను పడుకోబెట్టారు. అందరికీ గుడ్డలమూటలు రాలేదు. పసిపిల్లలూ ముదుసళ్ళు చల్లగాలికి బిగుసుకుపోతున్నారు.

"మీకెక్కడా చోటుదొరకలేదూ అందరూ ఇక్కడచేరారు? తెల్లారేసరికి ఇక్కడ ఒక మురికివాడను తయారుచేస్తారు. ఇంకా ముందుకువెళ్ళండి" టార్చిలైట్ల వెలుగులో ఆ జనాన్నిచూసి చీదరించుకుంటున్నారు ఆ ఇళ్ళ ఆసాములు.

"ఎక్కడా తావులేదు బాబయ్యా. ఇక్కడ కాస్త మెరకగా ఉందని చేరుకున్నాం. నీరు తియ్యంగానే వెళ్ళిపోతాం. చల్లగాలికి ముసలోళ్ళు పసిపిల్లలు బిగుసుకుపోతున్నారు బాబయ్యా. గుడ్డలమూటలు వెనకనుంచి మావోళ్ళు తెస్తా ఉన్నారు. రెండుగుడ్డలు పడెయ్యండి బాబయ్యా." చేతులు చాపుతున్నారు. కొంద

రికి ఒంటిమీద చొక్కా-గుడ్డలులేవు. తడిసిన ధోవతులను పిండుకుంటూ ముడుచుకుని కూర్చున్నారు.

మోకాటి లోతునీళ్ళు ఇళ్ళల్లోకి వచ్చేవరకూ జనం ఇంకా అక్కడినుంచి పరుగులు తీస్తునేఉన్నారు. ఆ సందడిలో కొందరు చెట్లెక్కారు. కొందరు ఇళ్ళ మీద కూర్చున్నారు.

ఆ వరద జలప్రళయమై, గట్లుతెంచుకుని ఒడ్డునఉన్న చెట్లను పడదోస్తూ, పంటచేలను ముంచుతూ, నురుగులు గ్రక్కుతూ, భయంకర నినాదాలుచేస్తూ చెవులకు హోరెత్తిస్తూ ముందుకు పరుగులు దీస్తున్నది. గ్రామాలను తుడిచిపెట్టి వెనక్కుతిరిగి చూడకుండా ముందుకు ఉరవడితో సాగిపోతున్నది.

తలలు దాచుకున్న జనం కళ్ళువిప్పుకుని ఆకాశంవంకచూస్తూ నిట్టూర్పులు విడుస్తున్నారు.

పంచమిచంద్రుడు ఆ సమయంలో కొసగంటితో ప్రసరింపచేసే వెలుగులో ఎడతెరిపిలేకుండా పరుగులుతీసే జలప్రవాహపు ఉరవడిలో ప్రజల హా హా కారాలు.

ఇంకాకొందరు మిగిలిపోయారు కాబోలు గుడిసెల్లో. ఎందరు కొట్టుకు పోయారో ? ఏడ్పులు- రాగాలు- గాలిహోరులో కలిసిపోతున్నాయి.

ఎప్పటికయినా తెల్లవారుతుందా ?

ఏడుగుర్రాలదొర దర్శనమిస్తాడా ?

నదీమతల్లి శాంతిస్తుందా ?

ఈ జనమంతా స్వస్థానం చేరుకుంటారా ?

అన్నట్టు గుడిసెలు గుడిసాకారంలో ఉంటాయా ?

గుడిసెలు కొట్టుకుపోతే చెట్లనీడయినా లేకపోతే ముదుసళ్ళగతి ?

పసికూనలు ?

ఈ ఆలోచనలతో ఉక్కిరిబిక్కిరయిపోతున్నారు ప్రజలు.

చెట్లకుకట్టిన గుడ్డఉయ్యాలలూ నులకమంచాలూ గాలికి ఊగుతున్నాయి. వాటిమీది జీవాలు చలికి బిగుసుకుపోతున్నాయి.

అంతలో పెనుగాలివీచింది. పెద్ద పెళార్భటులతో చెట్లుకూలిపోసాగాయి. నేలకొరిగిన చెట్లకొమ్మలు కొన్ని ప్రవాహంలో కొట్టుకుపోతున్నాయి.

ఈ ఉరుకు పరుగుల సమయంలో కోటయ్య ముడుచుకుపోయిన ముసలమ్మను బుజానవేసుకుని, నులకమంచాన్ని చేతబట్టుకుని ఎత్తుగడ్డకుచేర్చాడు. తిరిగి వెనక్కు వెళ్ళి ఇద్దరుపిల్లలను తల్లిదగ్గరికి చేర్చలేక మధ్యదారిలో పదిమంది చేరినచోటికి చేర్చాడు. అతడికి తనతల్లి కనబడలేదు. జనంతోకలిసి ముందు వెళ్ళిందో ? లేక కొట్టుకుపోయిందో ?

తనదొకదారీ ఆమెదొకదారీ అయింది.

"ఇవాళ ఇంతవరకూ చినుకులేదు. అదికూడాఉంటే మనగతి ఏమయ్యేదో" ననుకుంటూ ఉండగానే వాన సన్నటి చినుకుతో ప్రారంభమయి, కాసేపటిలో ఉధృతమై ఆకాశానికీ నేలకూ ధారలుకట్టింది.

తడిసి నీళ్ళుకారుతున్న బట్టలతో గుడిసెలన్నీ చుట్టివచ్చిన కోటయ్య ప్రవాహానికి ఎదురీదుతూ దాని ఉరవడికి కొట్టుకుపోతూ చేతికందిన చెట్లకొమ్మలను పట్టుకుని అవి ఎటుపోతే అటుపోతున్నాడు. కొంతదూరంపోయిన తరువాత కూలిన చెట్టొకటి ఎదురయింది. దానినందుకుని ఎక్కికూర్చున్నాడు.

అది ప్రవాహపు ఉరవడిలో ఈ ఒడ్డుకూ ఆ ఒడ్డుకూ కొట్టుకుంటూ సాగిపోతున్నది.

"ఓ మామా ఓ మామా" పొలికేకలు ఆ హోరులో గాలి ఈలలు వేసినట్టు వినబడుతున్నాయి.

తడుస్తున్న కోటయ్యదేహం జలదరించింది ఆ కేకలకు.

ఎవరివీ కేకలు ?

అవికేకలా గాలిహోరా ?

తనతల్లికేకలు కాదనిపిస్తోంది. మామా అన్న కేకల్లా ఉన్నాయే ?

గుంపుతో తడుస్తూ ఒకచోట ముడుచుకుని కూర్చున్న తల్లి ఆలోచనలు కోడలుమీద ఉన్నాయి. "కన్నవారింటినుంచి బిడ్డతో బండికట్టుకుని వస్తాన'ని చెప్పిపంపింది. నిజంగా పసిబిడ్డతో బయలుదేరిందా ? దారిలో వానపట్టుకుందేమో కూడా ఎవరయినా వచ్చారోలేదో ? బండిమాత్రం ఈ వరదలో సాగుతుందా? అయ్యో. పసిబిడ్డ-బాలెంత. తలమీద చేతులుపెట్టుకుని విధిని నిందిస్తోంది.

రామి ! మిసమిసలాడే యౌవనంలోఉన్న పద్దెనిమిదేళ్ళ రామి, కోటయ్యకు తల్లివైపుచుట్టం. ఎదిగినపిల్లకు పెళ్ళిచేయాలని వాళ్ళు వరుడికోసం వెదుకుతూ ఉండగా, తల్లితో చుట్టంచూపుగా వెళ్ళిన కోటయ్యతో ఆ మరుసటివారమే పెళ్ళి జరిగిపోయింది. బంగారం పెట్టకుండా పిల్లను తీసుకుపోగూడదని తన చెవుల కున్న కమ్మలూ, మెడలోఉన్న బంగారు గుండ్లూ తీసిపెట్టింది.

గొడ్లను కాసుకునే కోటయ్య పెళ్ళినాటికి ఎదిగి మునసబుగారి పొలం పాలికి వ్యవసాయం చేస్తూఉంటే తల్లిమాణిక్యం ఒకచిన్నదుకాణం పెట్టింది. పల కలూ, బలపాలూ, పిప్పరమెంట్లూ, బిస్కెట్లూ, అగ్గిపెట్టెలూ, బీడీలవంటి సరు కులు పెట్టింది. మంచి వ్యాపారదృష్టిగల మాణిక్యం కొట్టును బాగా నడిపిస్తూ, ఉన్నజాగాలోనే ఒకగదీ, సావడీ, వంటయిల్లూ, వెనక వసారాతో ఒక పెంకు టిల్లు ఏడెనిమిదేళ్ళలో కట్టింది.

అప్పటినుంచి కోటిగాడు కోటయ్యగా పిలవబడుతున్నాడు. తల్లీకొడుక్కూ ఒంటినిండా బట్ట- కడుపునిండా అన్నం అమిరాయి. మాణిక్యం కొద్దికొద్దిగా బంగారంకొని కమ్మలూ గుండ్లూ చేయించుకుంది.

కోటయ్యకు అదివరలో స్నేహితులు ఈగల్లా ముసురుతూ, వెంట వెంట తిరిగేవారు. పెళ్ళి అయిన తరువాత రామి చిన్నచిన్న కోరికలను తీర్చాలనీ ఉబ లాట పడేవాడు. పక్కఊళ్ళో సినిమాలకు భార్యతో వెళ్ళాలనీ, మిఠాయిలూ పూలూ కొనిపెట్టాలనీ సరదాపడి కాస్త డబ్బు ఖర్చుచేసేవాడు. తల్లికి ఏకైక సంతానమతడు. చిన్నతనంలో చిలిపిసరదాలని మురిసిపోయేది తల్లి. కోటయ్య అట్లా సంవత్సరాలను రోజులుగా గడుపుతూ డబ్బు ఖర్చుచేసినా చూసీ చూడ నట్టు ఊరుకునేది.

అందులో కోడలు అపురూపంగా గర్భవతి అయింది. కాన్పుకు పుట్టింటికి

వెళ్ళిన రామిని చూడటానికి నాలుగురోజులకొకసారి అత్తవారింటికెళ్ళి చూసివస్తూ ఉండేవాడు.

"ఒరే కోటీ. అత్తవారింటికి తరుచుగా వెళ్ళకూడదు. చులకనయిపోతావు. నీ పరువు నిలబెట్టుకో" అంటూఉండేది తల్లి. "పని వదిలిపెట్టిపోతే మునసబుగారేమంటారు ? నోటికాడి అన్నం పోగొట్టుకోవద్దు" అంటూ మందలించేది.

వయసులో ఉన్నాడు. పోవద్దంటే అతడి మనసు ఆగలేదు. సినెమాకు అని బయలుదేరి ఆ ఊరు వెళ్లేవాడు. నాలుగురోజులకుగాని కనబడేవాడుకాదు. తల్లితో ఏదో సాకు చెప్పేవాడు. స్నేహితులతోకూడా తిరిగేవాడు.

అట్లా తల్లికి చెప్పకుండా వెళ్ళి రామినిచూసి కనీసం నాలుగురోజులయినా ఉండే కోటయ్య హఠాత్తుగా వెళ్ళటం ఆపుచేశాడు.

కోటయ్య పొలంపనులు చూసుకునేవాడు. తీరికవేళల్లో దుకాణంలో కూర్చునేవాడు. కొడుకు దారిన పడ్డాడనుకుంది మాణిక్యం.

"కోటీ నీ స్నేహితులు కనబడటం లేదేమిరా" తల్లికి ఆ స్నేహితులెట్లా వదిలిపోయారో తెలియదు. తనకొడుకు బిడ్డలతండ్రి అవుతున్నాడు. బాధ్యతలు తెలుస్తున్నాయి. దుకాణాన్నికూడా జాగ్రత్తగా చూస్తున్నాడనుకునేది. కోడలికి నెలలు నిండుతున్నాయని సంబరపడిపోయేది. "ఒకసారివెళ్ళి చూసిరావాలిరా కోటీ" అనేది కాని తను వెళ్ళటానికి వీలుకాలేదు. ఆమెకు సంసారాన్ని ఇంకా బాగుచెయ్యాలనీ కోడలు వచ్చేవేళకు ఇంకా కొన్ని వసతులు కలుగచెయ్యాలి ఇంట్లో అనుకునేది. కాని కోడలు వస్తున్నదన్నవార్త తెలిసిన తరువాత వరద వచ్చి ఊరిమీదపడ్డది.

ఇంతలోకి ఈ వరదలు, అవీ ఇప్పుడే రావాలా ?

బైటికి వెళ్ళినకొడుకు ఇంటికిరాలేదు. తల్లిదొకదారీ కొడుకుది ఒకదారీ అయింది ఆ జనసందడిలో.

ఆ అలజడిలో ఇవన్నీ ఆలోచించే వ్యవధిలేదు. పదిమందితోపాటు తనూ మూటసర్దుకుని తలకెత్తుకుని బయలుదేరింది.

తెల్లవారవచ్చింది. అప్పటికి వర్షం తుప్పరగా మారింది.

ఆ వెలుగులో కోటయ్య తను ఎక్కిన తుమ్మ మొద్దు ఒడ్డుకు చేరుకోవటం గమనించాడు.

రాత్రి అంత ఉధృతంగా ప్రవహించి, ఊళ్ళను ముంచి, చెట్లను కూర్చిన వరదనీరు ఏమీ ఎరగనట్టుగా సాధువులా మామూలు నది ఆకృతిదాల్చి జాలు వారుగా సాగిపోవటం గమనించాడు కోటయ్య.

ఒడ్డంతా బురద బురదగా ఉంది. కాళ్ళు దిగబడిపోతున్నాయి

మళ్ళీ కోటయ్యకు 'మామోయ్ మామ' అనే పిలుపు దగ్గరగా వినబడి నట్లయింది.

చుట్టూ కలయజూశాడు. పదిగజాలదూరంలో ఒక చెట్టుమీద ఆడమనిషి గుడ్డలమూటలాంటిదేదో గుండె కదుముకుని కేకలు పెడుతోంది.

అతడు దిగబడిన కాళ్ళను బలంగా ఈడ్చుకుంటూ పైకి లాక్కుంటూ చెట్టు చుట్టూ ఉన్న బురదను దాటాలని శక్తినంతా కూడగట్టుకుని వేసిన అడుగులు మోకాటి వరకూ దిగబడ్డాయి.

"మామా, నీవేనా దబ్బునారా వచ్చి పాపనందుకో. నేను మెల్లగా చెట్టు కొమ్మలు పట్టుకుని దిగుతా. ఆందుకో పాపడిని" కేకలు పెట్టసాగింది.

పాదాలను అతి కష్టమ్మీద పైకి లాగుతున్న కోటయ్యకి మాటలు స్పష్టంగా వినబడ్డాయి.

"అది రామే. ఆ మాటలు దానివే."

"నీకు తోడుగా ఎవరూరాలేదూ? ఒక్కదానవే వచ్చావా?" కంఠం కరుకుగా ఉంది.

అతడి ముఖాన్ని ఆ సమయంలో ఎవరైనా చూడగలిగితే కోపావేశంతో అరుణిమ దాల్చిందనుకుంటారు. కంఠనాళాలు కూడా ఉబ్బినట్టు తెలుసుకుంటారు.

"ఆలస్యం చెయ్యకు మామా, మగబిడ్డ నీ కన్నకొడుకు నెత్తుకొచ్చాను. నాయన కూడా వచ్చాడు. ఈ అలజడిలో ఎటు చెదిరిపోయాడో? అందిస్తా పట్టుకో పట్టుకో" అంటోంది.

"మగబిడ్డనెత్తుకొచ్చావా రామి? మీనాయనాకూడా వచ్చాడా? చెట్టెక్కి బిడ్డను గుండెకదుముకున్నావా? అవును. నీ బిడ్డకదూ అదుముకో, పెంచుకో, నాకేమిటిట? నా బిడ్డయితే నేను నెత్తిన పెట్టుకుంటా"

అతడు తన పాదాలను విసురుగా పైకి లేవనెత్తి వెనక్కు తిరుగుతూ "తెల్లారినంక తిన్నగా మీ ఊరెళ్ళు" అన్నాడు.

"అదేంది మామా? వీడు నీ బిడ్డ, దేవుడి సాక్షిగా నీబిడ్డ. చెయ్యందివ్వు" అరుస్తోంది.

అతడు విసురుగా అడుగులువేస్తు కాలికి తగిలిన శవాలను ఒడ్డుకు లాగి పడేస్తూ సాగిపోతున్నాడు.

"అబ్బ, ఎన్ని శవాలు! ఎన్ని శవాలు !" బురదలో నుంచి బయటికి పెకిలిస్తున్నాడు. గాని చెట్టువంక చూడటంలేదు.

రామి మాటలు అతడి చెవికి సోకనంత దూరంగా అతి దూరంగా సాగి పోతున్నాడు.

మతి చలించినట్టుగా నవ్వుకుంటున్నాడు. తలకు చుట్టిన తుండుగుడ్డను తీసి కోపంకొద్దీ విదిలించి మళ్ళీ చుట్టుకుంటున్నాడు.

"మగ బిడ్డట, మగబిడ్డ! తన రక్తమా?" అన్న శంక పీడిస్తోంది ఆ శవాల మధ్య బురదలో మోకాళ్ళ వరకూ కూరుకుపోయిన కోటయ్యను. తన మురిపెం మూణ్ణాళ్ళే, అది ముక్కలయి తనకెదురయిందీనాడు."

"ఈ వరదలు ఊరికికాదు-తనకు. తనమనసు ముక్కలవటానికి వచ్చిన వరదలు."

బురదలో నుంచే జనం నడిచి తమతమ ఇళ్ళను సమీపిస్తున్నారు. కూలి పోయిన గుడిసెలను చూసి బావురుమంటున్నారు. మట్టిగోడలు నేలమట్టమయ్యాయి. గుడిసెమీద కప్పిన ఆకులు ఎగిరిపోయాయి. గోడలతోపాటు పైన కట్టిన బొంగులు కుప్పగా కిందికి జారి పడ్డాయి.

పిల్లల ఆకలి ఏడుపులు, పెద్దవాళ్ళకు క్రిందటి రాత్రే తిండ్లులేవు. ఒకరిద్దరు అన్నం కుండలతో బయలుదేరినవాళ్ళు పిల్లలకు తినిపించారు చెట్లకింద.

ఈ బురదలో నిప్పురాజేసెదెట్లా? ఎందులో వండాలి? ఏంపెట్టి వండాలి? అందరూ అన్నగత ప్రాణులు.

"ఇంకా ముందుకు పోదాం పదండి. ఎక్కడయినా బురదలేనిచోటికి పోదాం. కుండా, చట్టి ఊళ్ళోకిపోయి అడుగుదాం. నూకలుతెచ్చి పొయ్యిమీదికెక్కిద్దాం" మగవాళ్లు ధైర్యంచెబుతుంటే ఆడవాళ్ళు పిల్లల నెత్తుకుని కాళ్ళీడ్చుకుంటూ నడుస్తున్నారు వాళ్ళవెంట.

కోటయ్య తల్లి వెనకబడ్డది. ఆమెకూ "మామోయ్ మామా!" అన్న కేకలు వినబడ్డాయి. కేకలు వినబడ్డచోటికి చాలా దూరంలో ఉన్నదామె. ఆమె చేతిలో కర్ర ఉంచుకోవటం అలవాటు. దాని సహాయంతో నడవటానికి చాలా ప్రయాస పడ్డది. దారిలో కాలుకూడా జారింది. పడిలేచి ముఖంమీది బురదను తుడుచుకుంటూ ఆ దిశకు అడుగులువేసింది.

మళ్ళీ రెండుసార్లు కేకలు వినబడ్డాయి.

ఆమె వయసులో పెద్దది-అసలే కర్రతో నడిచేమనిషి-అందులో బురదలో నడవటం కష్టంతోకూడినపని-అతిప్రయాసతో ఆమె చెట్టు దగ్గరికి వచ్చేసరికి తల క్రిందులుగా పడిన మనిషి మోకాళ్ళ మాత్రం పైకి కనబడుతున్నాయి. గుడ్డ మాటొకటి చెట్టుకొమ్మకు అందుకోగలిగినంత ఎత్తులో వేలాడుతున్నది.

తలక్రిందులుగా కూరుకుపోయిన మనిషి మోకాళ్ళవంకా ఆమె మార్చిమార్చి చూసింది. ఆ కాలి వేళ్ళకు మట్టెలున్నాయి. 'బహుశః పడిపోయిన మనిషి స్త్రీ అయిఉంటుంది. ముందు తాను దిగి ఆ గుడ్డమూటను అందుకుందామనుకుందేమో? పాపం!" అనుకుంటూ ఆ మూటనందుకుంది. చేతికి గట్టిగా బరువు తగిలింది.

బట్టను తొలగించి చూసింది, పసిబిడ్డ. కళ్ళు మూసుకుని ఉంది గుండెమీద చెయ్యిపెట్టి చూసింది. గుండె కొట్టుకుంటోంది.

ఏ తల్లి పోగొట్టుకున్నదో ఈ పసిబిడ్డను? చెట్టుదిగి అందుకుందామన్న ఆశలో బోర్లాపడిపోయింది ఆ తల్లి."

ఆ దారిన ఇంకా కొంతమంది మగవాళ్ళు పెద్ద పెద్ద కర్రలతో వస్తున్నారు.

"నాయనా, నన్ను కాస్త చెయ్యి పట్టుకుని ఈ బురద గుంటను దాటిస్తారా? చేతిలో పసిబిడ్డఉంది" బ్రతిమిలాడింది.

ఆ మాటలు వినికూడా నలుగురు దాటిపోయారు. ఐదవవాడు-'నీకు ఒక కర్రా, ఒక బిడ్డేనా? ఎంత దూరంనుంచి వస్తున్నావు? ఒక చెయ్యి ఇటివ్వు గట్టిగా పట్టుకో'మని బురదగుంటను దాటించాడు.

"ఇంక పోగలవా?" చెయ్యి వదలిపెడుతూ అన్నాడు.

"పోతానయ్యా. ఇల్లు ఇంకో కోసెడు దూరం ఉంది. కాళ్లూ చేతులూ వణుకుతున్నాయి." అనుకుంటూ అడుగులు వేస్తూ మధ్యాహ్నం పన్నెండు గంటలకు ఇల్లు చేరింది.

ఇంటిచుట్టూ ఆకులూ కొమ్మలూ గాలికి వచ్చిపడినట్టున్నాయి. ఇంటిమీది పెంకులు కొన్ని కొమ్మలు పడటంచేత పగిలిపోయాయి. వాసం వంగింది. దుకాణమ్మీది రేకులు లేచిపోయాయి. సరుకు తడిసింది.

ఇంటి తలుపు తెరవగానే నిలిచిన నీళ్ళు తూములగుండా మెల్లగా బైటికి పోతున్నాయి. బియ్యపుకుండ సగం వరకూ నీళ్ళలో ఉంది. పసిబిడ్డకు మంచం వాల్చి బట్టవేసి పడుకోబెట్టింది.

ఏడ్చి ఏడ్చి ఉండటంచేత బిడ్డ గొంతెత్తి ఏడవటంలేదు, కుఁయ్ కుఁయ్ లాడుతున్నాడు.

"బిడ్డకు-ఆహారం ఏమివ్వాలి?" ఆమెకేమీ తోచలేదు. పసిబిడ్డకు తగిన ఆహారం ఇంట్లో ఏముంటుంది? అటకమిదినుంచి కట్టెలు తీసి పొయ్యిని వెలిగించి గిన్నెతో నీళ్ళు పడేసి పెరటి తలుపు తెరిచింది. పెరడంతా నానాబీభత్సంగా ఉంది. ఆకులూ అలము దుమ్మూ ఒరిగిపోయిన అరటిచెట్లు కాలు పెట్టటానికి సందు లేకుండా ఉంది. అరటిచెట్టుకింద ఎప్పుడు వచ్చిందో ఒక మేక రెండు పిల్లలతో పడుకుని ఉంది-ఆకులు నములుతూ.

తటాలున ఆమెకు మేకపాలుతీసి పిల్లవాటికి పోస్తే? కొద్ది కొద్దిగా చెంచాతో పోసి చూడాలి. అంతకంటే గత్యంతరంలేదని"పించింది. మేకను తాటితో కిటికీకి కట్టేసి అరుస్తున్నా తంతున్నా గ్లాసెడు పాలు తీయగలిగింది. అమె, వేడినీళ్ళతో

బిడ్డ ఒళ్ళంత కడిగి పడుకోబెట్టి ఒక్కొక్క బొట్టు బిడ్డనోటిలోకి జారవిడవటం మొదలు పెట్టింది బిడ్డ నిద్రలోకి జారుకున్నాడు.

"కోటి ఎటు వెళ్ళాడో? ఇల్లు చేరుకుంటాడో లేదో?" ఆమె ఆరాటపడిపోతునే అన్నం వండింది. నాలుగు గంటవరకూ చూసి అన్నం విస్తట్లో పెట్టుకుంది. ఊరగాయకుండలో నీళ్ళు నిలిచాయి. అవి వొంపి ఆ ఊరగాయతో భోజనం చేసింది.

సాయంత్రమారుగంటలవేళ కోటయ్య తడుముకుంటూ ఇంటికి వచ్చాడు. ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. చిన్న బుడ్డీ దీపం వెలుగుతోంది.

"కోటి, వచ్చావా నాయనా, నీదారినీదీ నాదారినాదీగా పరుగులు పెట్టాము. తిండీతీర్థంలేదు. కాళ్ళు కడుక్కు రా. అన్నం వండాను. తిందువుగాని" ఎదురుగా వెళ్ళింది.

బురదకాళ్ళు-ఒంటినిండా బురద చిందులు-ముఖమంతా మట్టి-కడుపులో ఆకలీ-మనసులో ఏదో బాధ-నీరసంగా కూలబడిపోయాడు కోటయ్య.

"వేడినీళ్ళు పెట్టాను. రెండు చెంబులు పోసుకురా."

వేడినీళ్ళు తగలగానే సగంచీదరపోయినట్లనిపించింది, కోటయ్యకు. అన్నం ముందర కూర్చుని పెట్టిందేదో తిని మంచమ్మీద ఒరగబోయాడు.

"ఒరే కోటీ! పిల్లవాడు పడుకున్నాడు. ఇంకానయం వాడిమీద పడుకున్నావు కాదు" అంటూ మరొక మంచంవాల్చింది. తడిసిన మంచంమీద గొంగళివేసి బట్టపరిచింది. "ఇంక పడుకో"

"పిల్లవాడంటావేంటి?" బిత్తరపోయాడు కోటయ్య.

తను వచ్చేటప్పుడు కనబడ్డ దృశ్యమూ విన్న కేకలదగ్గర్నుంచీ పిల్లవాడికి మేకపాలు పట్టేవరకూ చెప్పింది వివరంగా మాణిక్యం.

"ఆ కేకలు నేనూ విన్నాను. ఆ పిల్లవాడు మనవాడుకాదు. ఆ తల్లి ఎవరో? ఎవరిని బడితే వాళ్ళను ఇంటికి తీసుకురావటమేనా?'' అరిచాడు.

"అయితే నాకంటే ముందుగానే కేకలు విన్నవాడివి నీవే తీసుకురాలేక పోయావా?"

“వాడు నా రక్తం పంచుకు పుట్టినవాడు కాడని తెలిసే తీసుకురాలేదు” అరిచాడు.

“బిడ్డను చూశావా? పాపమాతల్లి తన కేకలకు ఎవరూ రాకపోతే గుడ్డలో చుట్టిన బిడ్డను కొమ్మల సందునపెట్టి చెట్టుదిగబోయి తలక్రిందులుగా బురదలో ఇరుక్కుపోయింది. మోకాళ్ళపైకి మట్టెలతో సహా కనబడ్డాయి. ఆకేకలు నాకూ వినబడ్డాయి. నేను రావటం ఆలస్యమైపోయింది. వచ్చేటప్పటికి ఈ ఘోరం జరిగిపోయింది''

“ఆ పసిగుడ్డుకు ఇంకాప్రాణంఉంది. ఇంటికి తీసుకువచ్చి మేకపాలు పోశాను. చూడు ఆ బిడ్డ - అచ్చం మీనాయనలాగుంటే మన బిడ్డకాదంటవా? నోరెట్లా వచ్చిందిరా కోటి ఆ మాట అనటానికి?”

అతడు తలఎత్తలేదు.

“ఒకవేళ నీకు ఏదో అనుమానమే మనసులో ఉన్నదనుకో. ఆ ఆపద సమయంలో ఆమె కేకలు పెట్టగా నీకు వినబడ్డాయని ఒప్పుకున్నావు. వరదలలో ఎంతో మందికి సహాయం చేశానని చెప్పావు ఎంతోమంది పసిబిడ్డలను కాపాడానని అన్నావు. మనసులో ఎట్లా ఉన్నా పాపమా రమామణికి చెయ్యందించితే చెట్టు దిగేదికదా ? ఆ బిడ్డను అందుకుని చేతిలో పెడితే నీవన్నట్టు వాళ్ళ యింటికి ప్రాణాలతో వెళ్ళేది కదా. అంతమాత్రం జాలీ కరుణా లేకపోయినందుకు నాకు బాధగా ఉంది. మానవత్వము లేదనిపించుకున్నావు”

“విశ్వమంత హృదయం కలదానివి నీవు తీసుకువచ్చావుగా ! పెంచి పెద్దవాడిని చెయ్యి”

అతడు గిరుక్కున వెనక్కుమళ్ళి మునసబుగారి పొలం వైపు వెళ్ళాడు తనకు విడిగా గుడిసె ఎక్కడ వేసుకుంటే బాగుంటుందా అని ఆలోచిస్తూ మరునాడు గుడిసెకు కావలసిన వస్తువు లన్నీ సమకూర్చుకుని గుడిసె వేసుకున్నాడు.